క్లుప్తంగా

లక్ష్యం మేరకు మొక్కలు పంపిణీ చేయాలి



పెర్కిట్: వన మహోత్సవంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు సిబ్బంది మొక్కలు పంపిణీ చేయాలని ఎంపీడీవో శివాజీ సూచించారు. ఆర్మూర్ మండలం పిప్రి గ్రామాన్ని ఎంపీడీవో శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. గామ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



బాల్కొండ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బాల్కొండ ఎస్సై శైలేందర్ అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రజీయొద్దీన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన అధికారులు



నందిపేట్: మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రోడ్డుపై ఉన్న గుంతలను సంబంధిత అధికారులు శుక్రవారం పూడ్చి వేశారు. ఈ రోడ్డు గుండా మండలంలోని పలు గ్రామాలతో పాటు నిర్మల్ జిల్లాకు వందలాది మంది ప్రయాణిస్తారు. కాగా ప్రధాన రోడ్డు పెద్ద గుంతలుగా మారి వర్షం నీరు నిలువడంతో పలువురు పాదచారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. తాత్కాలికంగా డస్టు, కంకరతో మరమ్మతులు జరుపకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా శక్తి సంబురాల్లో పాల్గొనాలి



డొంకేశ్వర్: ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో మహిళా గ్రూపుల సభ్యులు పాల్గొనాలని ఐకేపీ ఏపీఎం మాణిక్యం పిలుపునిచ్చారు. మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలు, బీమా, మహాలక్ష్మి పథకాలపై అవగాహన కల్పించారు. ప్రముఖ కళాకారుడు అష్ట గంగాధర్ ఆట,పాటలతో అలరించారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించి నిత్యవసర సరుకులు అందజేశారు. సీసీలు, ఓబీలు, వీవోఏలు, ఎస్హెచ్జీ మహిళలు పాల్గొన్నారు.

దాత సహకారంతో వంటశాల నిర్మాణం



మోర్తాడ్: మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో దాత సహకారంతో నిర్మించిన వంటశాలను శుక్రవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన సుంకం లక్ష్మణ్, మనోహర్లు అమెరికాలో స్థిరపడగా తమ తల్లి సుంకం ఆండాలమ్మ తండ్రి రాములు స్మారకార్థం వంటశాలను నిర్మించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం జగదీశ్వర్, హెచ్ఎం ప్రమీలా రాణి, పద్మ, వీడీసీ సభ్యులు మహిపాల్, గంగన్న, ఉపాధ్యాయులు విలాస్, పద్మావతి, లత, లహరిక, శ్రీలత, సాగరిక, జగన్నాథ్, సీఆర్పీ పరిమళ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మోర్తాడ్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని భీమ్గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ సూచించారు. శుక్రవారం వివిధ వార్డుల్లో నిర్వహించిన డ్రైడే పనులను పరిశీలించారు. వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది ఉన్నారు.

పర్యావరణాన్ని గాలికొదిలేశారు

- డంపింగ్ యార్డు వద్ద ప్లాస్టిక్ను వేరు చేయడంలో జాప్యం
- పేరుకు పోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు



డంపింగ్ యార్డు వద్ద పేరుకు పోయిన చెత్త



కొటార్మూర్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు రోజు రోజుకు పేరుకు పోతున్నాయి. దీంతో పర్యావరణం దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పట్టణంతో పాటు విలీన గ్రామాలైన పెర్కిట్, మామిడిపల్లి గ్రామాలు ఉన్నాయి. నిత్యం ఆయా వార్డుల నుంచి 30 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. కాగా డంపింగ్ యార్డుకు చేరుకున్న చెత్తను తడి, పొడి చెత్తగా వేర్వేరు చేస్తున్నారు. మొత్తం ఏడు మెట్రిక్ టన్నుల తడి చెత్త, ఐదు మెట్రిక్ టన్నుల పొడి చెత్త, 18 మెట్రిక్ టన్నుల మిశ్రమ చెత్త నిత్యం డంపింగ్ యార్డుకు చేరుతోంది. కాగా తడి, పొడి చెత్తతో ఎరువులు తయారు చేస్తున్నారు. మిశ్రమ చెత్తను బయోమైనింగ్ చేయక పోవడంతో అక్కడే పేరుకుపోతోంది. దీంతో పరిసర ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. డంపింగ్ యార్డు 44వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో ప్రయాణికులు అక్కడికి రాగానే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఇటీవల సీడీఎంఏలో మిశ్రమ చెత్తను బయోమైనింగ్ చేయడానికి టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టడంలో జాప్యం నెలకొనడంతో మిశ్రమ చెత్త రోజు రోజుకు పేరుకుపోతోంది.

పారిశుద్ధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 36 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణలో జాప్యం నెలకొనడంతో వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 36 వార్డులకు చెత్తను తరలించే వాహనాలు ఉండాల్సి ఉండగా 25 ఆటో ట్రాలీలు మాత్రమే ఉన్నాయి. అందులో మూడు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ట్రాక్టర్లను వినియోగించుకుంటున్నారు.



కొటార్మూర్లో చెత్తాచెదారంతో మురికి కాలువ

అలాగే రూ.50 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం మరమ్మతులకు గురై మూలన పడ్డది. స్వీపింగ్ యంత్రాన్ని బాగు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో చాలీచాలని సిబ్బంది మురికి కాలువలతో పాటు రోడ్లను శుభ్రం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మున్సిపల్లో 157 మంది సిబ్బంది ఉండగా మరో 20 మంది ప్రైవేటు వారిని పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగిస్తున్నారు.

టెండరు పూర్తయింది



డంపింగ్ యార్డు వద్ద పేరుకుపోతున్న మిశ్రమ చెత్తను బయోమైనింగ్ చేయడానికి సీడీఎంఏ స్థాయిలో టెండరు ప్రక్రియ పూర్తయింది. త్వరలో బయోమైనింగ్ చేసి మిశ్రమ చెత్తను లేకుండా చేస్తాం. అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 20 మంది ప్రైవేటు వారితో పారిశుద్ధ్య నిర్వహణను విధిగా చేపడుతున్నాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు హర్షణీయం



ఆర్మూర్లో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఆర్మూర్టౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ను గెలిపించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాహుల్గాంధీ జోడో యాత్ర సందర్భంగా జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ఉండాలని డిమాండ్ చేశారు. ఆ సూచనలను సీఎం రేవంత్రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్ పరిగణనలోకి తీసుకొని బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టం జీవన్, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్మున్ను, మోత్కూర్ లింగాగౌడ్, గిరి, రమణ, రమేశ్, బబ్లూ పాల్గొన్నారు.

నందిపేట్లో..



నందిపేట్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినందుకుగాను నందిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు చేపట్టారు. సీఎం రేవంత్రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు పాల్గొన్నారు.

మాకు మాత్రం నందిపేటే మండలం

డొంకేశ్వర్: ఈ ఫొటోలో కనిపిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల డొంకేశ్వర్ మండలం నూత్పల్లి గ్రామంలోనిది. డొంకేశ్వర్ కొత్త మండలంగా ఏర్పడి రెండేళ్లు అవుతున్నా పాఠశాల గోడపై ఇంకా నందిపేట్ మండలం అని రాసి ఉంది. ఇటీవల పాఠశాల పున ప్రారంభం సందర్భంగా గోడలకు రంగులు, బొమ్మలు వేయించిన సార్లు... మండలం పేరును మాత్రం మార్చకపోవడంపై పలువురు ఇదేం చోద్యమని చర్చించుకుంటున్నారు.



రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలి

ఆర్మూర్: రాష్ట్రంలోని రైతాంగానికి సరిపడా యూరియాను సరఫరా చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్ డిమాండ్ చేసారు. ఆర్మూర్ పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) మాస్లైన్ కార్యాలయంలోని కుమార్ నారాయణ భవన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు ఎరువుల కోసం సహకార సంఘాల వద్ద పాస్బుక్లను పట్టుకొని గంటల తరబడి బారులు తీరాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకుంటే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి దేవరాం, బి కిషన్, ఆకుల గంగారాం, యు రాజన్న, జక్కం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవీపేట: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్లో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్కో ఏడీఈ ప్రశాంత్రెడ్డి శుక్రవారం తెలిపారు. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ సరఫరా ఉండదని అన్నారు. విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎస్ఎస్ఆర్లో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు



నవీపేట: మండలంలోని జన్నెపల్లిలో ఉన్న ఎస్ఎస్ఆర్ సీబీఎస్ఈ పాఠశాలలో శుక్రవారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. హెడ్బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలలో విద్యార్థులు ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ ఎన్నికలలో ఓటేశారు. ఓటు హక్కు ప్రాధాన్యంతో పాటు ఉత్తమ పాలకులను ఎన్నుకునేందుకు స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు అవగాహన కల్పిస్తాయని ఎస్ఎస్ఆర్ ఎండీ మారయ్యగౌడ్, కరస్పాండెంట్ హరిత తెలిపారు.

గ్రామాల్లో ప్రపంచ జనాభా దినోత్సవం



రెంజల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కిసాన్నగర్లో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

సాక్షి నెట్వర్క్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పలు గ్రామాల్లో విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీలు చేపట్టారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ర్యాలీల్లో వైద్యాధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన

ఆర్మూర్టౌన్: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యసిబ్బంది అశోక్నగర్, అరుంధతి నగర్లలోని మహిళా సంఘాలకు డ్రై డే ఫ్రై డేలో భాగంగా డెంగీ లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్వో ప్రదీప్, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఆశా కార్యకర్తలు రాజవ్వ, పద్మ, కవిత, సాగర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పెర్కిట్/ మాక్లూర్: ఆలూర్ మండల కేంద్రంలో 20 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ రమేశ్, కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రేణు బాయి, నాయకులు నీలగిరి శ్రీను, మహేశ్, మల్లయ్య, ప్రశయ్తేజ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని కల్లెడి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రశయ తేజ్ అందజేశారు. నాయకులు ఎస్ మల్లయ్య, హరీశ్, అర్జిత్, సాయి చరణ్ పాల్గొన్నారు.



నేటి చిత్రం

మట్టి రోడ్డుగా మారిన బీటీ రోడ్డు

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ నుంచి మద్దెపల్లికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా మట్టిరోడ్డుగా మారింది. రైల్వే లైన్ వెడల్పు పనుల్లో భాగంగా ఫకీరాబాద్ శివారు నుంచి కాంట్రాక్టర్లు పెద్ద పెద్ద టిప్పర్లలో మొరంను తరలించారు. రోడ్డుపై గుంతలు పడడంతో మొరంతో పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా మట్టి రోడ్డుగా మారిపోయింది. ఆర్అండ్బీ అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేయించాలి. – మ్యాక దయానంద్, ఫకీరాబాద్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్: 99636 95349

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు నిలయాలు



పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం కాలనీలోని ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు



గోల్బంగ్లా ప్రాంతంలోని ఖాళీ స్థలంలో..

ఆర్మూర్టౌన్: వర్షాకాలం.. వ్యాధులు ప్రబలే సమయం. పరిశుభ్రతకు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సిన తరుణం. మురుగు, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఆర్మూర్ పట్టణంలోని కొత్త, పాత కాలనీల్లో ఖాళీ స్థలాలు, ఓపెన్ ప్లాట్లు, గుంతలలో నీరు నిలిచి దోమల వృద్ధి కేంద్రాలుగా మారాయి. దోమల బెడదతో రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సాయంత్రం నుంచి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.

ఆర్మూర్ పట్టణంలోని 36వార్డుల్లోని పలు ప్రాంతాల్లో ఖాళీస్థలాలు ఉన్నాయి. ఈ ఖాళీ స్థలాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నా ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. యజమానులు సైతం వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఖాళీ స్థలాలు రోడ్డు కంటే తక్కువ ఎత్తు ఉండడంతో వర్షపు నీరు అందులో చేరి చెరువుల్లా మారాయి. ఇవి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారడంతో కాలనీవాసులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు బాగా పెరగడంతో రాత్రి సమయంలో విష పురుగులు నివాసాల్లోకి వస్తున్నాయి. ఇలాంటి అపరిశుభ్ర వాతావరణం వల్లే విష జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నోటీసులు ఇస్తున్నాం

ఖాళీ స్థలాలు ఉన్న వారికి, శుభ్రంగా లేని ఇంటి యజమానులకు పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నాం. పలుమార్లు సూచించినా పట్టించుకోని యజమానులకు నోటీసులు ఇస్తున్నాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



వేల్పూర్లో మొక్కలు నాటుతున్న చైర్మన్ ముత్యంరెడ్డి



వర్నిలో మొక్కలు నాటుతున్న ఏఎంసీ చైర్మన్ సురేశ్

వేల్పూర్: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. ఏఎంసీ వద్ద శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవంలో పాలకవర్గంతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్లు గొరాయి నరేందర్, బొంబాయి గంగాధర్, జేడీ రవి, ఇమ్రాన్, వేల్పూర్ సొసైటీ వైస్ చైర్మన్ బైరి రవి, సభ్యులు పాల్గొన్నారు.

వర్ని: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వర్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్ బాబా సూచించారు. వన మహోత్సవంలో భాగంగా వర్ని మార్కెట్ కమిటీ ఆవరణలో, జీపీ పరిధిలో మొక్కలు నాటారు. ఎంపీడీవో వెంకటేశ్వర్, ఎంపీవో మారుతి, నాయకులు బారీ, లబాన్, పుల్లాజీ, గంగారాం పాల్గొన్నారు.

వేల్పూర్: మండల కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్లో వనమహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. విద్యార్థులు మొక్కల ఆకారాలు ధరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పిల్లమారి శ్రీనివాస్, కరస్పాండెంట్ భోజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో లబ్ధిదారులకు మేలు

రెంజల్: మాజీ మంత్రి, నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్రెడ్డి సహకారంతో లబ్ధిదారులకు త్వరితగతిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ఖాన్ అన్నారు. మండలంలోని నీలా గ్రామంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో నాయకులు గోసుల గంగాకిషన్, సొక్కుల సాయిలు, కిషన్, నిర్మల, జీపీ కార్యదర్శి సాయిలు, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు గృహనిర్మాణ మంజూరు పత్రాలు అందిస్తున్న మొబిన్ఖాన్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

మోర్తాడ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడానికి ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలని పార్టీ మోర్తాడ్ మండల అధ్యక్షుడు తాతగారి శివానందరెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు అనిల్, పుప్పాల నరేశ్, బద్దం శ్రీనివాస్రెడ్డి, తీగెల రమేశ్, జైడి చిన్నారెడ్డి, గంగారెడ్డి, ప్రసాద్, ప్రకాశ్, భోగ దేవేందర్, లక్ష్మీనర్సయ్య, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పాఠశాలల్లో బోనాల పండగ

రుద్రూర్: పొతంగల్ మండలం కల్లూర్ హైస్కూల్లో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, హెచ్ఎం మయూరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. రుద్రూర్ మండలం కొందాపూర్లో బోనాల పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో సాయిలు, బాలకృష్ణ, నారాయణ, సుధాకర్, పవన్కల్యాణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ సంక్షేమంపై అబద్ధాలు తగవు

కమ్మర్పల్లి: గల్ఫ్ బాధితుల సంక్షేమానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని తెలంగాణ గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం కమ్మర్పల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం గల్ఫ్ బాధితుల సంక్షేమం కోసం ఏడాదికి రూ. 500 కోట్లు కేటాయిస్తామని చెప్పి ఓట్లు దండుకున్నదే తప్పా నయా పైసా కేటాయించలేదని విమర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు పడిగెల ప్రవీణ్, తెడ్డు రమేశ్, సల్లూరి గణేశ్గౌడ్, అజహర్, కిషన్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్ తహసీల్దార్గా సురేందర్ నాయక్

రుద్రూర్: మండల తహసీల్దార్గా సురేందర్ నా యక్ శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు తహసీల్దార్గా ఉన్న తారాబాయి సెలవుపై వెళ్లడంతో ఉప తహసీల్దార్గా పనిచేస్తున్న సురేందర్ నాయక్కు జిల్లా ఉన్నతాధికారులు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

ఆర్మూర్: పీడీఎస్యూ ఆధ్వర్యంలో కరీంనగర్లో ఈ నెల 12 నుంచి రెండు రోజుల నిర్వహించే పీడీఎస్యూ రాష్ట్ర విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు నరేందర్ పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సత్య ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఆర్మూర్ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు నిఖిల్, మమత, నాయకులు, వివేక్, నిఖిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

వర్ని: అవాజ్ వర్ని మండల నూతన కమిటీని శుక్రవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రజా సంఘాల కన్వీనర్ నన్నేసాబ్ తెలిపారు. ఆవాజ్ మండల కన్వీనర్గా అఫ్సాన్, కోకన్వీనర్లుగా ఫెరోజ్, సైఫ్, సభ్యులుగా ఒసామా, సిరాజ్, అప్పు, ఆమేర్, సోను, ఫహీం, ముస్తాఖ్, ఇసాఖ్ ఎన్నికయ్యారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆర్మూర్టౌన్: ఆర్మూర్ పట్టణంలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలికల వసతి గృహంలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ సుమలత శుక్రవారం తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినులు 3 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినిలు వసతి కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.